15 నుంచి చేపల వేట నిషేధం

శ్రీకాకుళం ప్రతినిధి : సముద్ర జలాల్లో ఈనెల 15 నుంచి జూన్ 14వ తేదీ వరకు మెకనైజ్డ్, మోటారు బోట్ల ద్వారా చేపల వేటను నిషేధిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని మత్స్యశాఖ ఉప సంచాలకులు పి.వి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. వేట నిషేధంతో ఉపాధి కోల్పోనున్న మత్స్యకార కుటుంబాల్లో ఒకరికి రూ.10 వేలు చొప్పున ప్రభుత్వం ఆర్థికసాయం అందించనుందని పేర్కొన్నారు. గతేడాది అక్టోబర్ 30వ తేదీ నాటికి రిజిస్టర్ చేసుకుని ఉండడంతో పాటు బోటుకు లైసెన్స్ ఉండాలని తెలిపారు. బోటు ద్వారా వేట సాగించిన వారిలో ఆరుగురికి, సంప్రదాయ తెప్పలో ముగ్గురికి పరిహారం అందించనున్నట్లు తెలిపారు. పరిహారం చెల్లింపునకు అర్హులను గుర్తించేందుకు చేపల వేట చేసే ప్రాంతాలు, ఫిష్ ల్యాండింగ్ సెంటర్లలో ఈనెల 17వ తేదీన ఒకేసారి సర్వే చేయనున్నట్లు పేర్కొన్నారు. మత్స్యకార భరోసా కింద అందించనున్న భృతి కోసం అర్హులైన మత్స్యకారులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

ఈ ఏడాదిలోనైనా పూర్తయ్యేనా?

- మడ్డువలసకు బడ్జెట్‌లో అరకొర కేటాయింపులు
- మిగిలిన పనుల పూర్తికి రూ.23.83 కోట్లు అవసరం
- ప్రభుత్వం రూ.10 కోట్లే కేటాయింపు
- త్వరలో పనులను చేపట్టనున్న కొత్త నిర్మాణ సంస్థ

గొర్లె శ్రీరాములు నాయుడు మడ్డువలస రిజర్వాయర్ రెండో దశ పథకం ఈ ఏడాదిలో పూర్తి కావడంపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. బడ్జెట్‌లో కావాల్సిన మేర నిధులు కేటాయించకపోవడమే కారణంగా కనిపిస్తోంది. 2009లో ప్రారంభించిన ఈ ప్రాజెక్టు పనులు సుమారు 79 శాతం మేర పూర్తయ్యాయి. మిగిలిన 21 శాతం పనులను ఈ ఏడాది చివరికల్లా పూర్తి చేస్తే వేలాది ఎకరాలకు నీరందే అవకాశం ఉండేది. ఈ ఏడాది మార్చిలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సగం కూడా నిధులు కేటాయించలేదు. ప్రభుత్వం కేటాయించిన నిధుల మేరకు మిగిలిన పనులు చేపట్టేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఈనెల 18న శంకుస్థాపన పూర్తయిన తర్వాత పనులు ప్రారంభించేందుకు కొత్త నిర్మాణ సంస్థ సిద్ధమవుతోంది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

మడ్డువలస జలాశయ రెండో దశ పథకాన్ని నిర్మించాలని 2008లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. జనవరి 6, 2009లో రూ.57.87 కోట్లకు పరిపాలనా ఆమోదం కూడా తెలిపింది. జి.సిగడాం, పొందూరు, లావేరు, ఎచ్చెర్ల, మండలాల్లోని 24,954 ఎకరాలకు సాగునీరు అందించాలన్నది ఈ పథకం ప్రధాన ఉద్దేశం. దీంతో మొత్తం 21 గ్రామాలకు తాగునీరు అందించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. పథకం నిర్మాణ బాధ్యతలను విశాఖపట్నానికి చెందిన పిజెఆర్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ టెండర్లలో రూ.47.3933 కోట్లకు దక్కించుకుంది.

లావేరు మండలం కొత్తకొంకాం వద్ద తవ్వి వదిలేసిన కాలువలు

మార్చి 2, 2009న ఒప్పందం కుదుర్చుకుంది. ఒప్పందం ప్రకారం పనిని 24 నెలల కాలంలో పూర్తి చేయాల్సి ఉంది. అంటే మార్చి 2, 2011 నాటికే పనులు పూర్తయి రైతులకు సాగు నీరందించాల్సి ఉంది. ఒప్పంద కాలపరిమితులు పొడిగిస్తూ ప్రభుత్వం వరుసగా ఆరు పర్యాయాలు అవకాశం ఇచ్చింది. చివరిసారిగా కాలపరిమితిని జూన్ 30, 2018 వరకు పొడిగించింది. అధికారిక లెక్కల ప్రకారం 78.36 శాతం పనులు పూర్తయ్యాయి. మరో 21.64 శాతం పనులు మిగిలి ఉన్నాయి. ఒప్పందం విలువ రూ.47.393 కోట్లలో రూ.37.14 కోట్లు ఖర్చు చేశారు. ప్రస్తుతం సంబంధిత నిర్మాణ సంస్థ పనులు నిలుపుదల చేసింది. దీంతో ప్రభుత్వం జులై 8, 2020లో సంబంధిత నిర్మాణ సంస్థతో ఒప్పందాన్ని ముగించింది.

కొత్త నిర్మాణ సంస్థకు పనులు అప్పగింత

రిజర్వాయర్ పనులు చేపట్టిన పిజెఆర్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ ఇప్పటివరకు 78.36 శాతం మేర పనులు పూర్తి చేసి వైదొలగింది. మిగిలిన 21.64 శాతం పనులు చేసేందుకు కొత్త నిర్మాణ సంస్థకు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ ఆదేశాలతో ఇంజినీరింగ్ అధికారులు మిగిలిన పనులకు కొత్త రేట్లకు అనుగుణంగా అంచనాలను రూపొందించి ప్రభుత్వానికి నివేదించారు. ప్రభుత్వం వాటికి ఆమోదం తెలిపి రూ.26.90 కోట్లను మంజూరు చేస్తూ 2022 ఏప్రిల్ 25వ తేదీన ఉత్తర్వులు జారీ చేసింది. స్టేజ్-2లో అసంపూర్తిగా మిగిలిపోయిన పనులను పూర్తి చేసేందుకు హైదరాబాద్‌కు చెందిన బిఎన్‌బి ఇన్‌ఫ్రా ఇండియా ప్రయివేట్ లిమిటెడ్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ రూ.23.83 కోట్లతో టెండర్లను దక్కించుకుంది.

మడ్డువలసకు కేటాయింపులు పెరగవచ్చు

మడ్డువలస జలాశయం స్టేజ్-2 బడ్జెట్‌లో రూ.10 కోట్లు కేటాయించినా పెరిగే అవకాశం ఉంది. మిగిలిన పనుల పూర్తికి హైదరాబాద్‌కు చెందిన ఒక నిర్మాణ సంస్థతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. కొత్తగా చేపట్టనున్న మిగిలిన పనులకు శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం ఈనెల 18వ తేదీన శంకుస్థాపన చేస్తారు. మట్టి పనులు, ముఖ్యమైన నిర్మాణాలను వేసవి సీజన్‌లోనే తొలుత చేపడతాం. వర్షాకాలం ముగిసిన తర్వాత పూర్తిస్థాయిలో సిద్ధం చేస్తాం.

- పి.సుధాకరరావు,
కార్యనిర్వాహక ఇంజినీర్, ప్రత్యేక కట్టడాల విభాగం

నౌపడలో సిఎం సభ

- విష్ణుచక్రంలో పైలాన్ ఆవిష్కరణ
- కలెక్టర్, ఎస్‌పి స్థల పరిశీలన

ప్రజాశక్తి - నౌపడ

సంతబొమ్మాళి మండలం భావనపాడు గ్రీన్‌ఫీల్డ్ పోర్టుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేతుల మీదుగా ఈనెల 19న శంకుస్థాపన నేపథ్యంలో పర్యటనా ఏర్పాట్లను కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, ఎస్‌పి జి.ఆర్ రాధిక మంగళవారం పరిశీలించారు. విష్ణుచక్రం గ్రామంలో భూమిపూజ, పైలాన్ ఆవిష్కరణకు ఏర్పాట్లు చేస్తున్నారు. మూలపేట సమీపంలో సిఎం హెలీప్యాడ్ ప్రాంతాన్ని పరిశీలించారు. మూలపేట, విష్ణుచక్రం గ్రామస్తులకు శంకుస్థాపన ప్రాంతం వద్ద సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో బయట వారిని అనుమతించబోమని కలెక్టర్ తెలిపారు. ఆవిష్కరణ అనంతరం నిర్వాసితులు ముఖ్యమంత్రిని కలిసి సమస్యలు చెప్పుకునేందుకు గ్యాలరీని ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. అనంతరం నౌపడలో టెక్కలి-నౌపడ రహదారి ఆనుకుని ఉన్న ఆర్ అండ్ ఆర్ కాలనీకి సేకరించిన భూమిలో బహిరంగ సభకు అనుకూల ప్రదేశమని నిర్ణయించారు. 50 వేల మంది జన సామర్థ్యంతో సభ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డిని ఆదేశించారు. నౌపడలో సభ ప్రాంతానికి 500 మీటర్ల దూరంలో మరో హెలీప్యాడ్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశానికి టెక్కలి వైపు నుంచి వచ్చే వాహనాలకు పెట్రోల్‌బంకు వద్ద పార్కింగ్ స్థలాన్ని గుర్తించారు. పూండీ, పలాస నుంచి వచ్చిన వాహనాలకు నౌపడ వైపు పార్కింగ్‌కు స్థలాన్ని గుర్తించారు. హెలీకాప్టర్ ల్యాండింగ్ సమయంలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. చెట్లు, జంగిల్ క్లియరెన్స్ చేయాలని ఆర్అండ్‌బి అధికారులకు సూచించారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని డిఎస్‌పి జి.వి ప్రసాద్‌ను ఆదేశించారు. సమయం తక్కువగా ఉండడంతో తక్షణమే పనులు ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ, పోలీసు అధికారులు, విశ్వసముద్ర, ఎపి మారిటైం బోర్డు ప్రతినిధులు పాల్గొన్నారు.

సమావేశ స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్‌పి

పూలే ఆశయసాధనకు కృషి

శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సమ సమాజ నిర్మాణంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని, అదే మహాత్మా జ్యోతిరావు పూలేకు ఇచ్చే ఘన నివాళి అని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. పూలే 197వ జయంతిని పురస్కరించుకుని సాంఘిక సంక్షేమశాఖ ఆద్వర్యాన పాత శ్రీకాకుళంలోని జ్యోతిరావు పూలే పార్కులో జయంతి వేడుకలను మంగళవారం నిర్వహించారు. కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌తో కలిసి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి పూలే అని అన్నారు.

పూలే విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న స్పీకర్, కలెక్టర్

బహుజన సామాజిక విప్లవోద్యమ పితామహుడని కొనియాడారు. అణగారిన, బలహీన వర్గాల వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దడానికి గ్రామాల్లో పూలే వినూత్న కార్యక్రమాలు చేపట్టారని చెప్పారు. పూలే కన్న కలలను సాకారం చేసేందుకు ప్రయత్నించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బిసి కార్పొరేషన్ ఇడి ఆర్.గడ్డెమ్మ, బిసి సంక్షేమశాఖ అధికారి ఇ.అనురాధ, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి కె.రామారావు, డ్వామా, డిఆర్‌డిఎ పీడీలు జి.వి చిట్టిరాజు, డి.వి విద్యాసాగర్, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి, బిసి సంక్షేమ సంఘం నాయకులు పి.చంద్రపతిరావు బి.హేమమాలిని రెడ్డి, బాడాన దేవభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

పలాస : స్థానిక ప్రగతి భవన్‌లో పూలే చిత్రపటానికి రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరతరాలుగా అణచివేతకు గురైన బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఆత్మస్థైర్యం కల్పించి వారి సాధికారిత కోసం కృషి చేసిన మహనీయుడు పూలే అని కొనియాడారు. ఆయన అడుగుజాడల్లో ప్రతిఒక్కరూ నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు వెంకట్రావు, మండల అధ్యక్షులు పైల వెంకటరావు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ డబ్బీరు భవానీశంకర్, పిఎసిఎస్ చైర్మన్ దువ్వాడ మధుకేశవరావు తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

పెండింగ్ జీతాలు చెల్లించాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు
- నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నగరపాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులకు మార్చి జీతాలు, హెల్త్ అలవెన్స్ బకాయిలను వెంటనే చెల్లించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నగర అధ్యక్షులు ఎ.గణేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ఫెడరేషన్ ఆధ్వర్యాన కార్మికులు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ పారిశుధ్య కార్మికులు, విలీన పంచాయతీ కార్మికులు క్లాప్ ఆటోడ్రైవర్లకు 2 నుంచి నాలుగు నెలల వరకు పెండింగ్‌లో ఉన్న జీతాలు, హెల్త్ అలవెన్స్ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులకు ప్రతినెలా ఒకటో తేదీన తప్పనిసరిగా జీతాలు చెల్లిస్తామంటూ ప్రభుత్వం ఆప్కాస్‌ను ఏర్పాటు చేసిందన్నారు. అయినా మార్చి జీతాలు ఇంతవరకు చెల్లించలేదన్నారు. ఏప్రిల్ ప్రారంభమై పది రోజులు గడుస్తున్నా, నేటికీ మార్చి జీతాలు కార్మికులకు చెల్లించలేదన్నారు. మున్సిపల్ కార్మికుల్లో సగానికి పైగా దళితులు, గిరిజనులు ఉన్నారని, ఈస్టర్ పండగ ఉన్నా కార్మికులకు జీతాలు చెల్లించకుండా కార్మికుల కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఇక్కట్లపాల్జేయడం తగదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ నుంచి కార్మికులకు నేరుగా చెల్లించే హెల్త్ అలవెన్స్‌ను సైతం చెల్లించకపోవడం విచారకరమన్నారు. ఆప్కాస్ వ్యవస్థ ద్వారా 60 ఏళ్లు నిండిన వారిని బలవంతంగా ఉద్యోగాలను తొలగించారని, వారి స్థానంలో వారి బిడ్డలకు ఉద్యోగాలు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని విమర్శించారు. మున్సిపల్ కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్‌తో పాటు గ్రాట్యుటీ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచిన రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ పర్మినెంట్ సిబ్బందికి ఉద్యోగ విరమణ వయసు 62 ఏళ్లకు కొనసాగించే విధంగా నేటికీ ఉత్తర్వులు జారీ చేయలేదని విమర్శించారు. అనంతరం నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు యుగంధర్, జనార్ధనరావు, రాము, రాము, గురుస్వామి, మోహన్, రాజేశ్వరి, లలిత తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్ ఇంట విషాదం

అనారోగ్యంతో తల్లి, మరణవార్త తెలిసి గుండెపోటుతో భార్య మృతి

ప్రజాశక్తి - లావేరు

శ్రీకాకుళం తహశీల్దార్ ఎన్.వెంకటరావు కుటుంబంలో విషాదం చోటుచేసుకుంది. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన తల్లి దుర్గమ్మ (80) మంగళవారం మృతి చెందింది. ఆమె మరణవార్త తెలిసిన ఆయన భార్య పద్మజ (54) గుండెపోటుతో కన్నుమూసింది. దుర్గమ్మ వృద్ధాప్యం కారణంగా కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. లావేరులో ఇంటి వద్దే చికిత్స పొందుతున్నారు. ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మంగళవారం ఉదయం మృతి చెందింది. విషయం తెలుసుకున్న తహశీల్దార్ వెంకటరావు శ్రీకాకుళం నుంచి లావేరు బయలుదేరి వెళ్లారు. మరణవార్త తెలిసిన ఆయన భార్య పద్మజకు గుండెపోటు రావడంతో శ్రీకాకుళంలోని ఒక ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. వెంకటరావు లావేరు చేరుకుని తల్లి మృతదేహాన్ని చూస్తున్న సమయంలోనే భార్య మృతి చెందినట్లు ఫోన్ వచ్చింది. మూడు గంటల వ్యవధిలో తల్లి, భార్య మృతి చెందడంతో ఆయన కుటుంబసభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. స్వగ్రామం లావేరులోనూ విషాదఛాయలు అలుముకున్నాయి. తల్లి, భార్యకు స్వగ్రామంలోనే అంత్యక్రియలు నిర్వహించారు. మాజీ మంత్రి కొండ్రు మురళీమోహన్, శ్రీకాకుళం ఆర్‌డిఒ బొడ్డేపల్లి శాంతి మృతదేహాలకు నివాళ్లర్పించారు. వారి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పలువురు ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులు అంతిమయాత్రలో పాల్గొన్నారు. దుర్గమ్మ లావేరు-1 ఎంపిటిసిగా పనిచేశారు ఈమెకు ముగ్గురు కుమారులు. ఒక కుమార్తె. పెద్ద కుమారుడు వెంకటరావు శ్రీకాకుళం తహశీల్దార్‌గా చేస్తున్నారు. రెండో కుమారుడు త్రినాథరావు లావేరు జెడ్‌పిటిసిగా పనిచేశారు.

దుర్గమ్మ

పద్మజ

జిల్లాకు పోర్టు రావడం చారిత్రాత్మకం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాకు పోర్టు రావడం చారిత్రాత్మకమని రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. ఈనెల 19న ముఖ్యమంత్రి జిల్లా పర్యటన ఏర్పాట్లపై కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోర్టు రావడంతో ఈ ప్రాంత ప్రజల కల నెరవేరిందన్నారు. విశ్వ సముద్ర ప్రాజెక్టు అధికారులకు సమస్య ఉంటే కలెక్టర్‌తో చర్చించవచ్చని తెలిపారు. అధికారులకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. రూ.నాలుగు వేల కోట్లతో చేపట్టనున్న భావనపాడు పోర్టు, గొట్టాబ్యారేజీ లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు సిఎం శంకుస్థాపన చేస్తారని చెప్పారు. మూలపేట వద్ద హెలీప్యాడ్ ఉంటుందని, అక్కడ రెండు వేల మంది ప్రజలతో సిఎం ముఖాముఖి ఉంటుందన్నారు. అనంతరం నౌపడ వద్ద ఏర్పాటు చేసిన సభాస్థలికి సిఎం చేరుకుంటారని చెప్పారు. వకలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనలో ఈసారి రెండు హెలీప్యాడ్‌లు ఉన్నాయని తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్యే రెడ్డి శాంతి, టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి, ఎఎస్‌పి టి.పి విఠలేశ్వరరావు, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి, ఆర్‌డిఒ సీతారామ్మూర్తి, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్, ఇరిగేషన్ ఎస్ఇ తిరుమలరావు, విశ్వ సముద్ర ప్రాజెక్టు ఇన్‌ఛార్జి జయచంద్ర, ఎపి మారిటైమ్ బోర్డు ఉప కలెక్టర్ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు జ్యోతీబాపూలే 197వ జయంతి సందర్భంగా పూలే చిత్రపటానికి మంత్రి ధర్మాన పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

జగన్ పాలనలో రాష్ట్రం తిరోగమనం

ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

జగన్ పాలనతో రాష్ట్రం తిరోగమన పాలైందని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు విమర్శించారు. మండలంలోని కీర్తిపురంలో మంగళవారం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక రాష్ట్రం 20 ఏళ్లు వెనక్కి వెళ్లిపోయిందన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. అధికారంలోకొస్తే కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా తెస్తానన్న జగన్, కేసుల భయంతో కిమ్మనడం లేదని విమర్శించారు. విశాఖ రైల్వేజోన్ గానీ, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధులు గానీ, చివరకు విశాఖ ఉక్కు ప్రయివేటీకరణపై గానీ చేష్టలుడిగి చూస్తున్నారని దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాల్సిన బాధ్యత అధికార పార్టీ ఎంపీలపై ఉన్నా, వారు ఆ బాధ్యతను నిర్వర్తించలేకపోతున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రయోజనాలను కేంద్రం ముందు తాకట్టు పెట్టారని ధ్వజమెత్తారు. రాష్ట్రం అప్పుల ఊబిగా మారిపోయిందన్నారు. వైసిపి పాలనలో విపరీతంగా పెరిగిన ధరల వల్ల సామాన్య, మధ్యతరగతికి చెందిన కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఎన్నికల ముందు మళ్లీ జగన్ మాయమాటలు చెప్పడానికి సిద్ధమవుతున్నారని, మరోసారి మోసపోవద్దన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నుంచి ప్రజలు మార్పుకు శ్రీకారం చుట్టారని, వచ్చే ఎన్నికల్లో ఇదే బాట కొనసాగించి వైసిపిని ఇంటికి పంపిద్దామని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే బెందాళం అశోక్ మాట్లాడుతూ వైసిపి పాలనపై ప్రజల్లో తిరుగుబాటు మొదలైందన్నారు. వచ్చే ఎన్నికల్లో ఇచ్ఛాపురం నియోజకవర్గంలో టిడిపి విజయాన్ని ఎవరూ ఆపలేరన్నారు. అంతకుముందు టిడిపి సీనియర్ నాయకులు ఎల్.పద్మనాభం ఆధ్వర్యాన గిన్ని బాలరాజు, వి.నరహరి తదితర కుటుంబాలకు చెందిన వైసిపి కార్యకర్తలు టిడిపిలో చేరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఢిల్లీరావు, ప్రకాష్ నాయక్, ఏకాంబరి, దక్కత శ్రీను, కామేశ్వరరావు, ఢిల్లీ యాదవ్, మెరుగు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపీ రామ్మోహన్ నాయుడు

చెడు వ్యసనాలకు బానిస కావద్దు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

యువత చెడు వ్యసనాలకు బానిసలు కావద్దని జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. నగరంలోని బాపూజీ కళామందిర్‌లో యువతకు, కళాశాలల విద్యార్థినులు, తల్లిదండ్రులకు స్ఫూర్తి పోలీస్ కళా బృందాల ద్వారా పలు సందేశాత్మక సూచనలు మంగళవారం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్‌పి జి.ఆర్ రాధిక బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఎన్నో వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తూ పోలీస్ విధులు, పౌరుల బాధ్యతలపై అవగాహన, చైతన్యం కల్పిస్తున్నారని ప్రశంసించారు.ఎస్‌పి జి.ఆర్ రాధిక మాట్లాడుతూ 48 రోజుల పాటు 39 కళాశాలల్లో, 233 పాఠశాలల్లో సుమారు 366 గంటలు, 133 ప్రదర్శనలు స్ఫూర్తి పోలీస్ కళా బృందాల ద్వారా ప్రదర్శనలు ఇచ్చినట్లు తెలిపారు. స్ఫూర్తి కళా బృందాల ప్రదర్శన ద్వారా సమాజంలో చైతన్యం కలిగించిన పలువురు పోలీసులకు జెడ్‌పి చైర్‌పర్సన్, ఎస్‌పి చేతులమీదుగా బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డిఎస్‌పి మహేంద్ర, ఎఎస్‌పి టి.పి విఠలేశ్వర్, దిశ పోలీస్‌స్టేషన్ డిఎస్‌పి వాసుదేవ్, సిఐలు సతీష్ కుమార్, శ్రీనివాసరావు, సన్యాసినాయుడు, ఎస్ఐలు ప్రవల్లిక, లక్ష్మి, చంద్రకళ, పలు పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

బహుమతులను అందజేస్తున్న జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

మే 13న జాతీయ లోక్ అదాలత్

జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జాతీయ లోక్ అదాలత్‌ను మే 13వ తేదీన నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయసేవాధికార సంస్థ జిల్లా అధ్యక్షులు జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. నగరంలోని జిల్లా కోర్టులో గల జిల్లా జడ్జి ఛాంబరులో పలు మోటారు ఇన్సూరెన్స్ కంపెనీల అధికారులు, ఇన్సూరెన్స్ కంపెనీ స్టాండింగ్ కౌన్సిల్, మోటారు వాహన ప్రమాద కేసుల్లోని కక్షిదారుల న్యాయవాదులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా కేసులకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. 13న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో మోటారు వాహన ప్రమాద కేసులు ఎక్కువగా రాజీ చేయడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. వాహన ప్రమాద కేసుల్లో లోక్ అదాలత్‌లో రాజీ కావడం వల్ల కక్షిదారులకు ధనం, సమయం వృథా కావని, సత్వర న్యాయం లభిస్తుందన్నారు. లోక్ అదాలత్‌లో పరిష్కారమైన కేసులపై అప్పీలుకు అవకాశం లేదన్నారు. కక్షిదారులందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీ చేసుకోవాలని కోరారు. సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, యునైటెడ్ ఇండియా, ఓరియంటల్, న్యూ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీల అధికారులు, ఎపిఎస్ ఆర్‌టిసి అధికారులు, స్టాండింగ్ కౌన్సిల్ మంచు జనార్ధనరావు, పిటిషనర్ న్యాయవాదులు ఆర్.విజయ్, న్యాయవాదులు పి.వి రమణారావు, ఎస్.వి శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

చిక్కిన భారీ కొమ్ము కోనెం

ప్రజాశక్తి - సంతబొమ్మాళి

మండలంలోని లక్కివలస పంచాయతీ గెద్దలపాడుకు చెందిన మత్స్య కారుడు సురారపు సింహాచలం రింగు వలకు సుమారు 200 కేజీల బరువు గల కొమ్ము కోనెం మంగళవారం చిక్కింది. ఎక్కువ మొత్తం పలికే అవకాశమున్నా, నిల్వ చేసేందుకు కోల్డ్ స్టోరేజీ లేకపోవడంతో స్థానిక వ్యాపారులకు రూ.15 వేలకు విక్రయించారు.

మరిన్ని వార్తల కోసం

www.prajasakti.com

epaper.prajasakti.com

NAME CHANGE

I,**GUSIRI KAMAMMA**(Old Name), W/o GANGAIYA, resident of Door no.1-11,Basubanjeeri Village,Kanchili Mandal, Srikakulam District, A.P., Change name from GUSIRI KAMAMMA (Old Name) to LAXMI (New Name) hence forth I am being called as LAXMI (New Name),W/o GANGAIYA for all purposes.

మాట్లాడుతున్న లీడ్ బ్యాంక్ మేనేజర్ హరిప్రసాద్

సైబర్ మోసాలపై అప్రమత్తం

ప్రజాశక్తి - ఆమదాలవలస, ఎల్ఎన్‌పేట

సైబర్ మోసాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని లీడ్ బ్యాంక్ మేనేజర్ హరిప్రసాద్ అన్నారు. ఎల్ఎన్‌పేట మండలంలోని కొమ్మువలస గ్రామంలో ఆర్‌బిఐ పథకంలో భాగంగా యూనియన్ బ్యాంక్ సౌజన్యంతో ఎస్ఎస్‌టి స్వచ్ఛంద సంస్థ నిర్వహణలో భాగంగా ప్రజలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పలానా బ్యాంకు నుండి మాట్లాడుతున్నామంటూ ఎవరైనా ఫోన్లు చేసి మన బ్యాంక్ అకౌంటు వివరాలను అడిగితే సమాచారాన్ని ఇవ్వవద్దని సూచించారు. బ్యాంకులు అటువంటి సమాచారాన్ని లబ్ధిదారులకు అడగవని తెలిపారు. ఎటిఎంలలో అపరిచితులకు డబ్బులు విత్ డ్రా చేసి పెట్టమని కార్డును ఇవ్వరాదని సూచించారు. పిఎం బీమా, జీవన జ్యోతి బీమా యోజన, జీవిత బీమా, తదితర పథకాలను వివరించారు. డిజిటల్ పేమెంట్స్ వాటి వలన కలిగే లాభాలను ప్రజలకు వివరించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు ఇన్సురెన్స్ పథకాల గురించి విపులంగా ప్రజలకు వివరించారు. సైబర్ మోసాలకు గురైనప్పుడు 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు, ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్‌మెన్ 14448 టోల్ ఫ్రీ నెంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎల్ఎన్‌పేట యూనియన్ బ్యాంకు మేనేజర్ నరేష్ , గ్రామ పంచాయతీ సెక్రటరీ లావణ్య, సిఎఫ్ఎల్ కో-ఆర్డినేటర్‌లు చిగురుపల్లి వెంకటేష్ (చిన్ను) రామారావు తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలి

ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

ప్రజాశక్తి - రణస్థలం

పరిశ్రమ ప్రతినిధులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

పరిశ్రమల్లో ఉద్యోగాలు కల్పించాలని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. అరబిందో ఫార్మాలో పరిశ్రమ ప్రతినిధులతో ఎమ్మెల్యే సోమవారం సమావేశం అయ్యారు. ఆయన మాట్లాడుతూ అన్ని అర్హతలూ కలిగి స్థానిక నిరుద్యోగులకు పరిశ్రమలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో నిరుద్యోగ సమస్య ప్రధానంగా ఉందని, గడప గడపకు మన ప్రభుత్వంలో నిరుద్యోగ సమస్యను తన దృష్టికి తీసుకొస్తున్నారని, అధికంగా కంపెనీలు ఉండి ఉద్యోగాలు కల్పించడంలో వెనుకబాటు ఉందని వాపోతున్నారని చెప్పారు. సిఎం జగన్ చెప్పినట్లు కొత్త పరిశ్రమల్లో 75శాతం ఉద్యోగాలు కల్పించాలని చెప్పినా ఆ దిశగా పరిశ్రమల యాజమాన్యం స్పందించడం లేదని, మిగతా కంపెనీలు అరకొరగా స్పందిస్తున్నా.. అరబిందో నుంచి సహకారం లేదని అన్నారు. స్థానిక నిరుద్యోగులకు మా విజ్ఞప్తి మేరకు మే నాటికి ఉద్యోగాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో అరబిందో కంపెనీ సీనియర్ ప్రెసిడెంట్ హెచ్‌ఆర్‌యు.ఎన్.బి. రాజు, ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రతినిధి లంకలపల్లి ప్రసాద్, రణస్థలం జెడ్‌పిటిసి టొంపల సీతారాం, డిసిఎంఎస్ డైరెక్టర్ నక్క ప్రసాద్, పైడిభీమవరం పంచాయతీ ఎంపిటిసిలు ఆకల శ్రీనువాసరావు, మునకాల దుర్గారావు, నాయకులు లంకలపల్లి గోపి, బాలిశెట్టి శంకరరావు, కొణతాల లక్ష్మణరెడ్డి ,మండల రవి,మీసాల పండు, పైడి నాగరాజు, అల్లంపల్లి సతీష్, వైసిపి నాయకులు, శ్రేణులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

పోస్టాఫీసును విలీనం చేయొద్దని వినతి

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

పోస్టల్ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందిస్తున్న క్లబ్ ప్రతినిధులు

ఇచ్ఛాపురం బస్టాండ్ పోస్టాఫీసును సబ్ పోస్టాఫీసులో విలీనం చేయవద్దని జిల్లా సూపరింటెండెంట్ సత్యనారాయణను అలయన్స్ క్లబ్ అధ్యక్షులు ఎల్.నరసింహమూర్తి, పిఆర్‌ఒ డి.గోపీనాథ్‌రెడ్డి కోరారు. మంగళవారం పోస్టాఫీసు తనిఖీకి విచ్చేసిన సత్యనారాయణకు వారు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన స్పందిస్తూ పోస్టాఫీసు విలీనం కాకుండా చీఫ్ సూపరింటెండెంట్ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చినట్లు చెప్పారు. వినతిపత్రం అందించిన వారిలో ఉపాధ్యక్షులు జి.ఉమాశంకర్, డైరెక్టర్ కె.నరసింహమూర్తి, రావి జయకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కెఎన్‌పిఎస్ ర్యాలీ

టెక్కలి: రాష్ట్రంలోని పలు గ్రామాల్లో అంబేద్కర్ విగ్రహాల ఏర్పాటును అగ్రకులాల వారు అడ్డుకుంటున్నారని, దీన్ని నిరసిస్తూ కెఎన్‌పిఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి బి.ప్రభాకరరావు, ఎస్.వి.జగన్నాథం ఆధ్వర్యాన పట్టణంలో ర్యాలీ చేపట్టారు.వారు మాట్లాడుతూ అంబేద్కర్ జయంతి వరకు ప్రతి రోజూ నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో మిస్క కృష్ణయ్య, కోత ధర్మారావు, రాకోటి రాంబాబు, బి.రేవతి, కేశవ, రామకృష్ణ, పాపారావు, ప్రతాప్, రాము, మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

కవిటి: స్థానిక బస్టాండ్ ఆవరణలో సర్పంచ్ పూడి లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎస్ఐ కె.రాము, ఎంపిడిఒ సూర్యనారాయణ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి తీవ్రత దృష్ట్యా ప్రతి గ్రామంలోనూ చలివేంద్రం ఉండాలని, స్థానిక యువకులు, నాయకులు దీనిపై దృష్టి సారించాలని సూచించారు. అనంతరం పాదచారులకు మంచినీరు అందజేశారు కార్యక్రమంలో సర్పంచ్ పూడి లక్ష్మణరావు, ఎంపిటిసి పూడి నీలాచలం, కో-ఆప్షన్ సభ్యుడు పాండవ శేఖర్, మాజీ సర్పంచ్ బెందాళం వెంకటేశ్వరరావు, పొల్లాయి లక్ష్మణమూర్తి, పిన్నింటి జయరాం, పొల్లాయి ఉమ, ఇఒ వీరభద్రస్వామి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గిరిజన సంఘం నాయకుల అక్రమ అరెస్టు

మందస: మంత్రులు, ఎమ్మెల్యేల పర్యటనల పేరుతో ప్రజా సంఘాల నాయకుల అక్రమ అరెస్టులు తగవు అని సిఐటియు నాయకులు అన్నారు. మంగళవారం గిరిజన సంఘం నాయకులు ఎస్.ధర్మారావు, ఎస్.గురునాథ్, ఎస్.ఫల్గుణరావును పోలీసులు అరెస్టు చేశారు. వారిని పరామర్శించడానికి వెళ్లిన సిఐటియు నాయకులు ఆర్.దిలీప్‌కుమార్, రైతు సంఘం నాయకులు ధర్మారావును కూడా అరెస్టు చేశారు. అనంతరం విడిచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రశ్నించే వారి గొంతుక నొక్కేందుకు చూస్తున్నారని అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశించే హక్కు ఉందని అన్నారు. ప్రభుత్వం తన రాజకీయ లబ్ధికోసం ప్రజల హక్కులను హరించాలని చూడడం,అధికార పార్టీ అహంకారానికి నిదర్శనమని అన్నారు.

'పైల' స్ఫూర్తితో పోరాటాలు

వజ్రపుకొత్తూరు: కామ్రేడ్ పైల వాసుదేవరావు 13వ వర్ధంతి సభ రిట్టపాడులో మంగళవారం నిర్వహించారు. సిపిఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు, జి.బాలకృష్ణ, పల్లేటి నారాయణరావు పైల స్తూపం వద్ద అరుణపతాకాన్ని ఆవిష్కరించి, నివాళులర్పించారు. పైల స్ఫూర్తితో భావసారూప్య సంస్థలను ఏకతాటిపైకి తెచ్చి ఫాసిజంపై పోరు సల్పడమే ఆయనకు మనం ఇచ్చే ఘన నివాళులన్నారు. కార్యక్రమంలో పైల అప్పారావు, కృష్ణప్రసాద్, భైర కూర్మారావు, మాధవరావు, కుసుమ, ఈశ్వరమ్మ, హైమావతి, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో భూసారం

నవధాన్యాల కిట్లను పంపిణీ చేస్తున్న గిరిబాబు

పొందూరు: నవధాన్యాల సాగుతో భూసారం పెరుగుతుందని రాపాక సర్పంచ్ ప్రతినిధి కొంచాడ గిరిబాబు అన్నారు. తండ్యాం క్లస్టర్ పరిధిలోని రాపాక రైతు భరోసా కేంద్రం వద్ద నవధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రధాన పంటల వేయడానికి ముందుగా భూమిలో చల్లుకోవాలని తెలిపారు. అనంతరం పలువురు రైతులకు నవధాన్యాల కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో విఎఎ పి.ధనలక్ష్మి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది జి.శంకర్, పి.శ్రీనివాసరావు, పి.మల్లేష్, హైమావతి, సురేష్, హిమబిందు, తదితరులు పాల్గొన్నారు.

పూలే ఆశయాలు ఆదర్శనీయం

పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పిస్తున్న కృష్ణదాస్, వైసిపి నాయకులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

వైసిపి జిల్లా కార్యాలయంలో జరిగిన వేడుకల్లో పార్టీ అధ్యక్షులు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కష్ణదాస్ హాజరై పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో వైసిపి నాయకులు శిమ్మ రాజశేఖర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ గొండు కష్ణమూర్తి, మునిసిపల్ మాజీ ఛైర్పర్సన్ ఎంవీ పద్మావతి, సుగుణ రెడ్డి , రాష్ట్ర అర్బన్ డెవలప్మెంట్ డైరెక్టర్ కింతలి రమేష్ బాబు, జిల్లా వక్ఫు బోర్డ్ అధ్యక్షులు సిరాజుద్దిన్, రాష్ట్ర వెలమ కార్పోరేషన్ డైరెక్టర్ గంగు శారద, అరసవిల్లి సూర్యనారాయణ స్వామి ట్రస్ట్ బోర్డ్ మాజీ సభ్యురాలు యమిజల గాయత్రి, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి ఆధ్వర్యాన...

నగరంలోని 80అడుగుల రోడ్డు లో ఉన్న జిల్లా టిడిపి కార్యాలయంలో జ్యోతిరావు పూలే జయంతి వేడుకులను నిర్వహించారు. ఈవేడుకల్లో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లు అర్పించారు. ఈకార్యక్రమంలో నగర టిడిపి అధ్యక్షులు మాదారపు వెంకటేష్, ప్రధాన కార్యదర్శి చిట్టి నాగభూషణం, జిల్లా టిడిపి అధికార ప్రతినిధి ముద్దాడ కృష్ణమూర్తి నాయుడు, బిసి అధ్యక్షులు కలగ జగదీష్, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు పి.ఎం.జె బాబు, మీడియా కోఆర్డినేటర్ జామి భీమశంకర్, రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి కోరాడ హరిగోపాల్, నగర బిసి అధ్యక్షులు ఉంగటి రమణ, జిల్లా ఐటిడిపి కోఆర్డినేటర్ ప్రధాన విజయరాం పట్నాల పార్వతీశం, మాజీ కౌన్సిలర్ గంగు నాగేశ్వరావు, వెంకటరామరాజు,జిల్లా కోలా శ్రీనివాస్ దేవ్, కవ్వాడి సుశీల తదితరులు పాల్గొన్నారు.

గాంధీ మందిరంలో..

నగరంలోని గాంధీ మందిరం జరిగిన వేడుకల్లో డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్ కస్తూరిబా గాంధీ, జ్యోతిరావు పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో గాంధీ మందిర కమిటీ ప్రతినిధి డాక్టర్ జామి భీమశంకర్ సురంగి మోహనరావు, నటుకుల మోహన్, ప్రొఫెసర్ విష్ణుమూర్తి, నక్క శంకరరావు, గుత్తు చిన్నారావు, డాక్టర్ బాడాన దేవభూషణరావు, పొన్నాడ రవికుమార్, అనంతం భట్లు తదితరులు పాల్గొన్నారు.

బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యాన...

జ్యోతిరావు పూలే పార్కులో బిసి సంక్షేమ సంఘం ఆద్వర్యాన జయంతి వేడుకలను నిర్వహించారు. ఈవేడుకల్లో సంఘం అద్యక్షులు పిట్ట చంద్రపతి, కార్యదర్శి బాడాన దేవభూషణరావు, జర్నలిస్టు సంఘం నాయకులు కొంక్యాన వేణుగోపాల్ ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి డిపోలో...

మహాత్మా జ్యోతిరావు పూలే 197వ జయంతి ఉత్సవాల్లో భాగంగా ఎపిఎస్ ఆర్‌టిసి శ్రీకాకుళం ఒకటో డిపోలో ఆయన చిత్రపటానికి పిఒ కృష్ణవేణి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రెండో డిపో మేనేజర్ కె.ఆర్.ఎస్ శర్మ, అసిస్టెంట్ మేనేజర్ వి.రమేష్, దక్షిణామూర్తి తదితరులు పాల్గొన్నారు.

కవిటి: జ్యోతిరావు పూలే ఆశయాలు ఆదర్శనీయమని ఎంపిపి కడియాల పద్మ అన్నారు. మండలంలోని శిలగాం సచివాలయంలో పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఎంపిపి మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతికి పాటుపడ్డారని కొనియాడారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు కడియాల ప్రకాష్, ఎంపిడిఒ సూర్యనారాయణరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి బి.పుష్ప పూలే చిత్రపటానికి పూలమాలేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రామారావు, కె.మోహన్‌రావు, ఉప్పాడ రాజారెడ్డి, చిట్టిబాబు, పాతిర్ల రాజశేఖరరెడ్డి, దీనబంధు, వెంకటరమణ, లక్ష్మినారాయణ, ఢిల్లీరావు, తదితరులు పాల్గొన్నారు.

లావేరు: మురపాక శాఖా గ్రంథాలయంలో పూలే చిత్రపటానికి గ్రంథాలయాధికారి ఎం.శ్రీనివాసరావు పూలమాలేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు జి.షణ్ముఖరావు, విద్యార్థులు, పాఠ కలు పాల్గొన్నారు.

నందిగాం: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి ఎన్.శ్రీరామ్మూర్తి పూలే చిత్రపటానికి పూలమాలేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో చిన్ని జోగారావు యాదవ్, హర్షబాడ సర్పంచ్ మలియా కృష్ణారావు, బి.మధుసూదనరావు, సంతోష్, నాగరాజ్, తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి: టిడిపి కార్యాలయంలో హెచ్ రామకృష్ణ, ఎం.దమయంతి పూలే చిత్రపటానికి పూలమాలేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో కె.లవకుమార్, రాము, షన్ముఖరావు, తదితరులు పాల్గొన్నారు.

కెఎన్‌పిఎస్ నాయకులు మిస్క కృష్ణయ్య పూలే చిత్రపటానికి పూలమాలేసి, నివాళులర్పించారు. కార్యకమంలో బి.ప్రభాకరరావు, కె.ధర్మారావు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబురు గోవిందమ్మ ఆధ్వర్యాన, వడ్డెర సంఘం నాయకులు ఎం.ఆనంద్‌కుమార్ ఆధ్వర్యాన, సమతా సైనిక్ దళ్ జిల్లా కార్యదర్శి చల్లా రామారావు ఆధ్వర్యాన పూలే జయంతి నిర్వహించారు.

పలాస: టిడిపి కార్యాలయంలో పూలే చిత్రపటానికి వజ్జ బాబురావు పూలమాలేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో బడ్డ నాగరాజు, గాలి కృష్ణారావు, శశిభూషణరావు, జి.సూర్యనారాయణ, ఎ.కృష్ణమూర్తి, గుప్త, మల్లి, నర్సింగులు, అత్మారావు, సింహాచలం, సంతోష్, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి ఆర్.ఉమామల్లేశ్వరరావు, జెడ్‌పిటిసి డి.వెంకటరావు పూలే చిత్రపటానికి పూలమాలేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ నిర్మల, సంపతిరావు హేమసుందరరాజు, ఎ.రామారావు, పి.వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణ కమ్యూనిటీ హాల్‌లో నౌగాపు నాగరాజు పూలే చిత్రపటానికి పూలమాలేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో రంగోయి అరుణకుమారి, ఇంద్రజ, రాజేశ్వరి, లక్ష్మి, శారద, సుధారాణి, తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు: వైసిపి నాయకులు ఎల్.తులసీవరప్రసాద్ తన స్వగహం వద్ద పూలే చిత్రపటానికి పూలమాలేసి, నివాళులర్పించారు. పారాపురంలో బిఎస్‌పి నాయకులు బి.కృష్ణారావు పూలే 196వ జయంతి నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పూలే జయంతి సందర్భంగా వ్యాసరచన, డిబెట్, క్విజ్ పోటీలు నిర్వహించారు. వీరికి అంబేద్కర్ జయంతి రోజు బహుమతులు అందజేయనున్నారు. వసప కెజిబివిలో సర్పంచ్ వలురౌతు ఆఫీసురావు ఆధ్వర్యాన పూలే చిత్రపటానికి జెడ్‌పిటిసి భాగ్యవతి పూలమాలేసి, నివాళులర్పించారు. నేతాజీ నగర్‌లో పూలే చిత్రపటానికి డి.జయమ్మ, గుమ్మాయ, తిరుపతిరావు, గోపి పూలమాలేసి, నివాళులర్పించారు.

కంచిలి: జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు ముండల పరిషత్ కార్యాలయంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపిపి దేవదాస్‌రెడ్డి, గుమ్మడి రామదాసు, వజ్జ మృత్యుంజయం, ఎన్.బాబురావు, డి.తులసి బలరాం, కొనపల సురేష్, తదితరులు పాల్గొన్నారు.

సైన్యంలో చేరేందుకు యువత ఆసక్తి

ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సైన్యంలో ఆఫీసర్ క్యాడర్ ఉద్యోగాల్లో చేరేందుకు సిద్ధమవుతున్న ఉత్తరాంధ్ర యువత నిరంతర సాధన చేయాలని, అప్పుడే లక్ష్యాన్ని నెరవేర్చుకోగలరని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. నగరంలోని ఎంపీ కార్యాలయంలో డిఫెన్స్ కెరీర్ గైడ్‌లైన్స్ పుస్తకాన్ని మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ప్రాంత యువతకు సైన్యంలో ఆఫీసర్ కేడర్ స్థాయి ఉద్యోగులపై అవగాహన లేక, కిందిస్థాయి ఉద్యోగాలకే పరిమితమైపోతున్నారని చెప్పారు. ఈ ఆలోచన తోనే సైన్యంలో ఆఫీసర్, సోల్జర్ స్థాయి ఉద్యోగాలకు అవగాహన కల్పిస్తూ ఇండియన్ ఆర్మీ కాలింగ్ సంస్థ డిఫెన్స్ కెరీర్ గైడ్‌లైన్స్ డైరీని రూపొందించడం అభినందనీయమన్నారు. నోటిఫికేషన్లు ఎప్పుడు విడుదలవుతాయి, ఏ ఏ అర్హతలు ఉండాలి వంటి వివరాలు తెలుసుకునేందుకు పుస్తకం ఉపయోగపడుతుందన్నారు. ఈ పుస్తకాలను పాఠశాలలు, గంథాలయాల్లో ఉంచడం ద్వారా యువతకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. మేలో నిర్వహించే ఇండియన్ ఆర్మీ కాలింగ్ ఎంట్రన్స్ పరీక్షకు ఈనెల 25వ తేదీ లోగా ఆన్‌లైన్ చేసుకోవాలని ఇండియన్ ఆర్మీ కాలింగ్ సంస్థ డైరెక్టర్ బి.వి రమణ తెలిపారు. ఇండియన్ కెరీర్ గైడెన్స్ పుస్తకాలను తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో 30 వేల వరకు ప్రచురించినట్లు చెప్పారు. పుస్తకాలు కావాల్సిన వారు 6281284246 ఫోన్ నంబరును సంప్రదించాలన్నారు. సైన్యంలో చేరేందుకు ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఇండియన్ ఆర్మీ కాలింగ్ ఎంట్రన్స్ టెస్ట్‌కు సంబంధించి www.indianarmycalling.com వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.

ఇది దగా ప్రభుత్వం : టిడిపి

ప్రజాశక్తి - ఆమదాలవలస

తురకపేటలో ఇదేం ఖర్మలో కూన రవికుమార్

అన్ని తరగతుల ప్రజలను వైసిపి ప్రభుత్వం దగా చేసిందని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని తురకపేట గ్రామంలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్తూ గత టిడిపి ప్రభుత్వానికి నేటి వైసిపి ప్రభుత్వానికి గల తేడాను ప్రజలకు వివరించారు. శిలాఫలకాలు తప్ప అభివద్ధి పనులు ఎక్కడ జరగడం లేదన్నారు. టిడిపి హయంలో చంద్రన్న భీమాను కుటుంబంలో 18 సంవత్సరాలు దాటిన ప్రతి వ్యక్తికి వర్తింపచేసామని నేటి వైసిపి ప్రభుత్వం వైఎస్ఆర్ బీమా పేరుతో కుటుంబంలో ఒక్కరికే అమలు చేస్తున్నదని మండిపడ్డారు. ఎన్నికలకు ముందు నవరత్నాలు అమలు చేస్తామని ఊదరగొడుతూ ప్రసంగాలు చేసిన జగన్మోహన్‌రెడ్డి ఎన్నికలయ్యాక పలు రకాల అంశాలతో సంక్షేమ పథకాలలో కోత పెట్టి ప్రజలను ఇక్కట్లు పాల్జేస్తున్నారని ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రజలు ఏ విషయంలోనైనా గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి ఉన్న తేడాను గుర్తించి చంద్రబాబు నాయుడు నాయకత్వాన్ని బలపరచి వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యదర్శి సనపల డిల్లేశ్వరరావు, ఎంపీటీసీ అన్నెపు భాస్కరరావు, సర్పంచ్ గొండు రమణ, టిడిపి నాయకులు తమ్మినేని అమర్నాథ్, శెట్టి నరసింగరావు, కూన రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పనులు ప్రారంభిస్తున్న సూరాడ వెంకటేష్

'ఉపాధి'తో వలసల నివారణ

సంతబొమ్మాళి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా వలసలు నివారించవచ్చని మలగాం సర్పంచ్ ప్రతినిధి సూరాడ వెంకటేష్ అన్నారు. మంగళవారం మలగాం పంచాయతీ అన్ని గ్రామాల్లోనూ ఉపాధి హామీ పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కంది లచ్చయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ నానిబాబు పాల్గొన్నారు.

రైతు కుల సంఘం మండల కార్యవర్గం ఎన్నిక

ఇచ్ఛాపురం: స్థానిక ఎల్లమ్మ గుడి వద్ద రైతు కుల సంఘం మండల కార్యవర్గం ఎన్నుకున్నారు. కన్వీనరు జన్నేళ ప్రసాదరావు అధ్యక్షతన జరిగిన ఎన్నికలో మండల అధ్యక్షులుగా గిన్ని బాలరాజు, ప్రధాన కార్యదర్శిగా కాళ్ల ధర్మారావు, ఉపాధ్యక్షులుగా దున్న లోకనాథం, కె.యాదవరెడ్డి, వి.ధర్మారాజు, నర్తు భానోజీరావు, పి.రాజశేఖర్, మంగి బాబురావు, కోశాధికారిగా శ్యామ్‌సుందర్, ఛత్రపతి శివాజీ, సలహాదారునిగా దక్కత ఢిల్లీరావును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆసి చిరంజీవులురెడ్డి, టి.కూర్మారెడ్డి, దొరబాబురెడ్డి, చాట్ల లోహిదాస్‌రెడ్డి, పాపారావు, విశ్వనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఫ్లెక్సీల తొలగింపులో వివక్షపై నిరసన

ప్రజాశక్తి - టెక్కలి

టిడిపి నాయకుల ఫ్లెక్సీలను తొలగించిన పంచాయతీ అధికారులు వైసిపి నాయకుల ఫ్లెక్సీల తొలగింపులో ఎందుకు అలసత్వం ప్రదర్శిస్తున్నారని టిడిపి నాయకులు పంచాయతీ కార్యదర్శి వినోద్‌కుమార్‌ను ప్రశ్నించారు. మంగళవారం పంచాయతీ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. టిడిపి నాయకులు మాట్లాడుతూ అచ్చెన్న పుట్టిన రోజు ఫ్లెక్సీలపై వైసిపి నేతల స్టిక్కర్లు అతికించారని, దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే చర్యల్లేవన్నారు. టిడిపి నేతల ఫ్లెక్సీలను తొలగించారని, ఇప్పుడు వైసిపి నాయకులు ఫ్లెక్సీలను ఎందుకు తొలగించలేదని ప్రశ్నించారు. ఇటువంటి ఘటనలు పునరావృతం అయితే ఉపేక్షించేది లేదన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎం.పురుషోత్తం, మామిడిరాము, హెచ్.రామకృష్ణ, మెండ దమయంతి, ప్రతీష్ చంద్, కె.లవకుమార్, పి.చంద్రశేఖర్, పి.షణ్ముఖరావు, డి.ప్రసాద్‌రెడ్డి, మధు, జీరు వెంకటరెడ్డి, కామేష్, చంద్రరావు, మణి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు యునిసెఫ్ ప్రశంసాపత్రం

ప్రజాశక్తి - కవిటి

మండలంలోని నెలవంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మంగళవారం సాయంత్రం యునిసెఫ్ నుంచి ప్రశంసా పత్రాలు అందుకున్నారు. మనిషి నిత్యజీవితంలో ఎదుర్కొంటున్న అనేక సమస్యలు పరిశీలించి, పరిష్కార మార్గాలు అన్వేషించే క్రమంలో యునిసెఫ్ సౌజన్యంతో ఎన్.సి.ఇ.ఆర్.టి రూపొందించిన ఇన్నోవేషన్ కార్యక్రమంలో విద్యార్థులు చూపించిన ప్రతిభకు యునిసెఫ్ ప్రశంసా పత్రాలు పంపించినట్లు పాఠశాల హెచ్ఎం మోహనరావు తెలిపారు. భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు ఎం.రామ్మోహనరావు పర్యవేక్షణలో 25మంది విద్యార్థులు వివిధ ప్రాజెక్టులు రూపొందించి ఎన్‌సిఇఆర్‌టి వెబ్ సైట్‌లో పంపించినట్లు ఆయన తెలిపారు. విద్యార్థులు చూపిన ప్రతిభకు మెచ్చి యునిసెఫ్ ఈ ప్రశంసా పత్రాలు అందజేసినట్లు హెచ్ఎం తెలిపారు. భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు రామ్మోహనరావును, ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యార్థులను ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్, ఎంఇఒ ధనుంజయ మజ్జి, ఎఎంసి చైర్మన్ దువ్వు కృష్ణారెడ్డి, సర్పంచ్ ప్రతినిధి కుమార్ మోహనరెడ్డి, సహచర ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టిన సిఐ పైడయ్య

హత్య కేసులో నిందితుల అరెస్టు

ప్రజాశక్తి - లావేరు

పథకం ప్రకారమే నిందితులు తాపీమేస్త్రిని హత్య చేశారని జెఆర్‌పురం సిఐ పైడయ్య, ఎస్ఐ కోటేశ్వరరావు తెలిపారు. మురపాక గ్రామానికి చెందిన గనమాన రాము ఈ నెల 2న పెద్దరావుపల్లి సమీపంలో ఉన్న గెడ్డవాగులో హత్యకు గురైన విషయం తెలిసింది. ఈ హత్య కేసులో నిందితులను పోలీసులు మంగళవారం విలేకరుల ముందు ప్రవేశపెట్టారు. వారు మాట్లాడుతూ మృతుని భార్య కుమారి టాపీ పని చేస్తుంది. ఆమె మరో టాపీ మేస్త్రి ప్రసాద్‌తో అక్రమ సంబంధం పెట్టుకుంది. ఈ విషయం తెలుసుకున్న భర్త భార్యను వేధించేవాడు. దీన్ని భరించలేక కుమారి జరిగిన విషయాన్ని ప్రసాద్‌కు చెప్పింది. దీంతో ప్రసాద్ పాత శ్రీకాకుళానికి చెందిన కొండ్రు సతీష్ కుమార్, బాగు కిరణ్‌తో పథకం రచించాడు. మార్చి 31న రాత్రి రామును హత్య కేసేందుకు సిద్ధమయ్యారు. ఆ రోజు రాము పనికి వెళ్లకపోవడంతో బతికిపోయాడు. ఈ నెల 2న బయ్యన్నపేట కూడలిలో బస్సు షెల్టర్ వద్ద రామును హత మార్చేందుకు కాపలా కాశారు. అర్ధరాత్రి మురపాక సమీపంలో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద వేచి ఉన్నారు. రాము ఇంటి నుంచి ద్విచక్ర వాహనంతో బయలుదేరిన విషయం తెలుసుకున్న నిందితులు పెద్దరావుపల్లి వద్ద రాము వాహనాన్ని ఢీకొన్నారు. కిందపడిపోయిన వ్యక్తిని గెడ్డవాగులోకి తీసుకెళ్లి గొంతు నులిమి చంపేశారు. పెట్రోల్ బంకు వద్ద సిసి ఫుటేజీ, ఫోన్ కాల్ ఆధారంగా నిందితులను సోమవారం పట్టుకున్నట్లు చెప్పారు. మంగళవారం ఉదయం ఎస్‌పి జిఆర్ రాధిక, డిఎస్‌పి మహేంద్ర సీన్‌ను రీ ఓపెన్ చేయించారు. సమావేశంలో జి.సిగడాం ఎస్ఐ రామారావు, హెచ్‌సి రామారావు, సిబ్బంది చక్రధర్, తదితరులు పాల్గొన్నారు.

దొంగ నోట్ల కలకలం

- ఎటిఎంలో రూ.44వేల నకిలీ నోట్లు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బ్యాంకు అధికారులు

ప్రజాశక్తి - టెక్కలి

పట్టణంలోని యాక్సిస్ బ్యాంకు

టెక్కలిలోని ఓ ఎటిఎంలో నకిలీ నోట్లు కలకలం సృష్టించాయి. ఎటిఎంలోని డిపాజిట్ మిషన్‌లో నకిలీ నోట్లను గుర్తుతెలియని వ్యక్తులు తమ బ్యాంకు ఖాతాలో డిపాజిట్ చేసి, చలామణిలోకి తేవాలనుకున్న వారి ప్రయత్నం బెడిసికొట్టింది. దీనిపై సంబంధిత బ్యాంకు అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. పూర్తి వివరాలిలా ఉన్నాయి.

మార్చి 29న రాత్రి 7.30గంటల సమయంలో స్థానిక యాక్సిస్ బ్యాంకు ఎటిఎంలోని డిపాజిట్ మిషన్‌లో ఓ గుర్తుతెలియని వ్యక్తి 88 నకిలీ రూ.500 నోట్లను తన బ్యాంకు ఖాతాలో వేసుకొని, ఆ మొత్తం తన ఖాతాలో క్రెడిట్ అయ్యాక సొమ్ము చేసుకుందామని భావించాడు. రూ.44 వేల నకిలీ నోట్లను తన బ్యాంకు ఖాతాలో వేసేందుకు మిషన్‌లో పెట్టాడు. దొంగనోట్లు కావడంతో డిపాజిట్ మిషన్ నగదు బదిలీని రద్దు చేసింది. నోట్లను ఎటిఎంలో ఉన్న మరో ఖాళీ పెట్టెలోకి పంపింది. ఎప్పటిమాదిరిగానే ఈ నెల 3వ తేదీన ఎటిఎంలో డబ్బులు వేసేందుకు వెళ్లిన అధికారులకు ఓ పెట్టెలో నకిలీ నోట్లు ఉండటాన్ని గుర్తించారు. విషయం తెలుసుకున్న బ్యాంకు మేనేజరు సుబ్రహ్మణ్యం టెక్కలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ ఎల్.రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపంతో వృద్ధుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - మెళియాపుట్టి

మృతి చెందిన గురుమూర్తి (ఫైల్)

చాపర గ్రామానికి చెందిన పట్టపగలు గురుమూర్తి(70) మనస్థాపంతో బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు మృతుడు, తన ఇద్దరి కుమారుల మధ్య ఆస్తి వివాదం ఉండేది. దీనిపై గతంలో టెక్కలి సబ్ కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశారు. అయితే తన పెద్ద కుమారుడు హరిప్రసాద్ వద్ద ఉన్న గురుమూర్తి జనవరి నుంచి చిన్న కుమారుడు షణ్మఖరావు వద్ద ఉంటున్నాడు. ఇంతలో ఏమైందో ఏమో తెలియదు కుమారుడు ఇంటి పెరడులోని బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని కుమార్తె పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాజేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మీ ఆదరణ కావాలి

జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ

ప్రజాశక్తి - కంచిలి

గత ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని, వైసిపిని వచ్చే ఎన్నికల్లో ప్రజలంతా ఆదరించాలని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. మండలంలోని ఎస్‌ఆర్‌సిపురం పంచాయతీలో మంగళవారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ స్టిక్కర్లను అందించడమే కాకుండా ప్రభుత్వం ద్వారా అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అన్నితరగతుల ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత సిఎందేనన్నారు. కార్యక్రమంలో ఎంపిపి దేవదాస్ రెడ్డి, పిఎసిఎస్ అధ్యక్షుడు గుమ్మడి రామదాసు, వజ్జ మృత్యుంజయం, ఎస్.బాబురావు, సర్పంచ్ దొక్కరి తులసి బలరాం, తదితరులుపాల్గొన్నారు.

లావేరు: కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

లావేరు: మండలంలోని బుడతవలసలో మంగళవారం మా నమ్మకం నువ్వే జగన్‌లో ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో జెసిఎస్ ఇన్‌ఛార్జి మీసాల శ్రీనివాసరావు, సర్పంచ్ ఆర్.సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: పురపాలక సంఘంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి ఆర్‌పిలతో మంగళవారం సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రూపులో ఒకరు పది గడపలకు వెళ్లి జగనన్న కరపత్రాలు ఇచ్చి, అందులో విషయం చదివి, వినిపించాలని, సిఎం స్టిక్కర్‌ను అతికించాలని కో రారు. వారికి చైర్‌పర్సన్ కరపత్రాలు అందించి, వారి ఫోన్లకు సిఎం స్టిక్కర్లను అతికించారు.

కంచిలి: స్టిక్కర్లను అతికిస్తున్న జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

సామాజిక భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ రామ్మోహన్ నాయుడు

సామాజిక భవనం ప్రారంభం

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

మండలంలోని బిర్లంగి గ్రామంలో ఎంపీ లాడ్స్ నిధులు రూ.7 లక్షలతో నిర్మించిన పొందర సామాజిక భవనాన్ని ఎంపి రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే అశోక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా విచ్చేసిన ఎంపీ, ఎమ్మెల్యేకు గ్రామస్తులు మేళతాళాలు, కొయ్య డాన్సులతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఏకాంబరి, దుపాన బృందావతి, దుపాన సూర్యనారాయణ, మెరుగు సూర్యనారాయణరెడ్డి, సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ రికార్డులు తనిఖీ

సోంపేట: మండలంలోని బారువ సచివాలయంలో డిఎల్‌డిఒ మంగమ్మ, ఎంపిడిఒ వెంకటరమణ మంగళవారం రికార్డులు తనిఖీ చేశారు. ప్రజల సమస్యలు తెలుసుకొని, పరిష్కరించాలన్నారు. రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, రికార్డుల నిర్వహణపై పలు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వెంకట అప్పలనాయుడు

మత్తుతో జీవితం చిత్తు

సోంపేట: మత్తు పదార్థాల వినియోగంతో జీవితాలు చిత్తు అవుతాయని ఎస్‌ఇబి ఇన్‌స్పెక్టర్ టి.వెంకట అప్పలనాయుడు అన్నారు. మంగళవారం బారువ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గంజాయి, కొకైన్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సలీం భాషా, కళాశాల, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జనం కోసం జనసేన

ఆమదాలవలస, సరుబుజ్జిలి: ప్రజా సమస్యల పరిష్కారం జనసేనతోనే సాధ్యమని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహనరావు అన్నారు. మంగళవారం సరుబుజ్జిలి మండలంలోని తెలికిపెంట పంచాయతీ పర్వతాలపేట, ఎల్‌పి అగ్రహారంలో జనం కోసం జనసేనలో భాగంగా ఇంటింటికీ వెళ్లి జనసేన పార్టీ సిద్ధాంతాలను, షణ్ముఖ వ్యూహం, కౌలు రైతులకు జనసేన అండగా నిలబడుతున్న అంశాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు పైడి మురళీమోహన్, మండల నాయకులు మాదడ్ల నాగరాజు, టంకాల తిరుపతి, రాకోటి రమేష్, కొంగరాపు మౌళి, మురాల మిన్నారావు, మోహన్, దుర్గాప్రసాద్, శ్రీధర్, రమేష్, కోటి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలతో మాట్లాడుతున్న రామ్మోహనరావు

రోడ్డున పడకుండా చూడాలి

కంచిలి: రైల్వే స్టేషన్‌కు ఆనుకొని ఉన్న స్థలంలో 30 ఏళ్లగా ఉంటున్నామని, తమను అక్కడ నుంచి వెళ్లిపోవాలని రైల్వే అధికారులు నోటీసులిచ్చారని, రోడ్డున పడకుండా మీరే ఆదుకోవాలని బాధిత కుటుంబసభ్యులు కోరారు. ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడును ఎస్‌ఆర్‌సి.పురం, కంచిలి మెయిన్ రోడ్డుకు చెందిన ప్రజలు కలిసి, వినతిపత్రం అందించారు. రైల్వే ట్రాక్ సమీపంలోని రైల్వే స్థలంలో రైల్వే అధికారులే పలు వ్యాపార సముదాయాలకు లీజుకు స్థలాన్ని ఇచ్చారన్నారు. వాటి పక్కనే ఉన్న స్థలంలో తాము 30 ఏళ్లగా నివాసం ఉంటున్నామని ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. రైల్వే ఉన్నతాధికారులతో మాట్లాడి తమకు న్యాయం చేయాలని కోరారు. ఎంపీతో పాటు ఎమ్మెల్యే బెందాళం అశోక్, నాయకులు ఉన్నారు.

రైల్వే అండర్ పాస్ నిర్మించాలని వినతి

ఎంపికి వినతిపత్రం అందిస్తున్న ప్రజలు

ఇచ్ఛాపురం: పట్టణంలో రత్తకన్న వెళ్లే మార్గంలో రైల్వే గేటు వల్ల నిత్యం రాకపోకలకు అంతరాయం కలుగుతోందని, అండర్‌పాస్‌వేకు కృషి చేయాలని ప్రజలు ఎంపీ రామ్మోహన్‌నాయుడుకు వినతిపత్రం అందించారు. స్పందించిన ఎంపీ ఉన్నతాధికారులతో మాట్లాడుతానని హామీ ఇచ్చారు.

సుద్దముక్కపై పూలే

పలాస: మహాత్మా జ్యోతిరావుపూలే జయంతి సందర్భంగా కొత్తపల్లి రమేష్ ఆచారి సుద్దముక్కపై పూలే చిత్రాన్ని చెక్కి అబురపరిచాడు. 21వ వార్డు గాంధీనగర్‌కు చెందిన ఈయన రెండు గంటల్లోనే పూలేను సుద్దముక్కపై చెక్కి, వాటర్ కలర్స్ వేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సూక్ష్మ కళాకారుడిని పలువురు అభినందించారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-రణస్థలం

ప్రకృతి వ్యవసాయంపై రైతులు అవగాహన కలిగి ఉండాలని ప్రకృతి వ్యవసాయ సబ్ డివిజనల్ యాంకర్ గంట్యాడ రాంబాబు అన్నారు. కుమ్మరిపేట గ్రామంలో సోమవారం ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. రాంబాబు మాట్లాడుతూ అధిక దిగుబడులు సాధించడంతో పాటు ఆరోగ్య కరమైన పంటలు పండించాలని కోరారు. ఖాళీగా ఉన్న పొలాల్లో నవధాన్యాల సాగుతో భూసారం పెరుగుతుందన్నారు. కొన్ని రకాల కషాయాలు తయారు చేసి, చూపించారు. కార్యక్రమంలో కిల్లారి సన్యాసినాయుడు, ఐసిఆర్‌పిలు, కె.విజయలక్ష్మి, పి.సత్యనారాయణ, ఇంద్రావతి, వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కషాయం తయారు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ అధికారులు

చెరుకు రైతులతో ముఖాముఖి

ప్రజాశక్తి - ఆమదాలవలస

మండలంలోని నిమ్మ తొర్లాడ, మర్రి కొత్తవలస, కొరపాం చేపేనపేట గ్రామాల్లో చెరుకు సాగుచేస్తున్న రైతులతో గ్రామీణ సహజ ఫార్మర్ ప్రొడ్యూసింగ్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ చైర్మన్ మామిడి వెంకట సూర్యనారాయణ, సిఇఒ సూర్యనారాయణ ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు రైతులతో మాట్లాడుతూ బెల్లం తయారీలో వివిధ రకాల కొత్త మెలకువలను వివరించారు. బెల్లం పొడిని తయారు చేయుటకు శిక్షణ కార్యక్రమాలకు కొంతమంది రైతులను ఎంపిక చేశారు. బెల్లాన్ని నిల్వ చేసుకునేందుకు కోల్డ్ స్టోరేజ్ హోమ్స్‌ను నిర్మించేందుకు సిద్ధంగా ఉన్నామని రైతులకు తెలిపారు. రైతు నక్క చిరంజీవి మాట్లాడుతూ తాను ఏ విధంగా బెల్లాన్ని తయారు చేస్తున్నది, మార్కెటింగ్ తదితర విషయాలను సమావేశంలో తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సోమరాజు తేజేశ్వరరావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో హాజరైన ప్రజలు

పిల్లలు చదువుకున్నారు.. ఉద్యోగాలు ఇవ్వండి

స్పీకర్‌ను కోరిన ప్రజలు

బూర్జ : స్పీకర్‌కు సమస్యను విన్నవిస్తున్న ప్రజలు

ప్రజాశక్తి - బూర్జ

మా పిల్లలు డిగ్రీ, ఆపై చదువులు చదుకున్నారు.. వారికి ఉద్యోగాలు ఇవ్వాలని పాలవలస గ్రామస్తులు స్పీకర్ తమ్మినేని సీతారాం కోరారు. పాలవలసలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ రాష్ట్రానికి అనేక కంపెనీలు వస్తున్నాయని, వాటిలో ఉద్యోగం కల్పించేందుకు సిఎం కృషి చేస్తున్నారని అన్నారు. జోష్ పురం వద్దాక్రమంలో రాగోలు, గుమ్మలక్ష్మీపురం గ్రామాలకు చెందిన ఇద్దరు వృద్ధులు ఉన్నారని, వారికి వృద్ధాప్య పింఛను, రేషన్ బియ్యం అందడం లేదని, దీన్ని పరిష్కరించాలని స్పీకర్‌కు వినతిపత్రం అందించారు. స్పీకర్ వెంటనే స్పందించి తహశీల్దార్ రమణారావుకు సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిపి కె.దీప, జెడ్‌పిటిసి రామారావు, కె.గోవిందరావు, గుమ్మడి రాంబాబు, జల్లు బలరాంనాయుడు, తహశీల్దార్ రమణారావు, ఎంపిడిఒ రవీంద్రబాబు, ఎఒ రాజేశ్వరరావు, ఎపిఒ రాజకుమార్, రమణమూర్తి, మౌనిక, తదితరులు పాల్గొన్నారు.

జలుమూరు: పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. జోణంకి పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. కృష్ణదాస్ గడప గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపిపి వాన గోపి, వైసిపి మండల కన్వీనరు కనుసు సీతారాం, రమణి, పి.ముసలినాయుడు, పి.రాజాప్పలనాయుడు, ఎం.శ్యామలరావు, విఠల్‌రావు, బి.లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

జి.సిగడాం: మండలంలోని మెట్టవలస గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పాల్గొన్నారు. ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ పనితీరుపై సంతృప్తిగా ఉన్నారా? లేదా? సంక్షేమ పథకాలు అందుతున్నాయా? లేదా? తదితర అంశాలపై ఆరా తీశారు. అనంతరం మా నమ్మకం నువ్వే జగన్‌లో భాగంగా ఇళ్లకు వెళ్లి స్టిక్కర్లు అతికించారు. కార్యక్రమంలో మీసాల వెంకటరమణ, కాయల రమణ, దోల వెంకటరమణ, ఎ.ప్రకాష్, పి.సన్యాసిరావు, బాలి అప్పలసూరి, ఎంపిడిఒ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

జలుమూరు : కరపత్రం అందిస్తున్న కృష్ణదాస్